

డిఈవో వరలక్ష్మి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లా విద్యాశాఖాధికారిగా బి వరలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం డిఈవో మాట్లాడుతూ గతంలో సూపరింటెండెంట్, ఏడీగా పనిచేసిన అనుభవంతో ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లాలో పని చేయడం ఎంతో సంతోషంగా వుందన్నారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల సహకారంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ ను పటిష్టం చేయ డంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించనున్నట్లు చెప్పారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఈవో వరలక్ష్మి

యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- పాడిరైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి
- సిపిఎం 14వ జిల్లా మహాసభ తీర్మానం
- రెండోసారి జిల్లా కార్యదర్శిగా వాడ గంగరాజు



జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు హైదర్‌వలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సిపిఎం 14వ జిల్లా మహాసభ జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. మొదటిరోజు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రెండో రోజైన ఆదివారం స్థానిక కట్టమంచి రోడ్డులోని శాంతా రఘురామ్ కళ్యాణ మండపంలో సిపిఎం జెండాను పార్టీ సీనియర్ నాయకులు హైదర్‌వలి ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులు స్థూపానికి రాష్ట్రనాయకులు రమాదేవి, దడాల సుబ్బారావు, జిల్లా నాయకత్వం నివాళి అర్పించింది. జిల్లా నాయకులు సురేంద్రన్, షకీల అధ్యక్షతన సమావేశం కొనసాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సిపిఎం సిద్ధం కావాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి పిలుపునిచ్చారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడారు. కేంద్రలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు నాయడు ప్రభుత్వం పేద, బడుగు బహీనవర్గాల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను గెలిచిన తరువాత పట్టించుకోవడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరల అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం అన్ని వర్గాలకు ప్రజలను కలుపుకొని పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గత మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో నిర్వహించిన ప్రజాసమస్యలపై పోరాటాలను సమీక్షించి రానున్న మూడేళ్లలో ప్రజాసమస్యలపై భవిష్యత్తు పోరాటలకు రూపకల్పన చేశారు.

సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, నాయకులు ఓబుల్‌రాజు, సురేంద్రన్, గిరిధర్‌గుప్తా, భువనేశ్వరి, సృజనిలతో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



రెండోసారి జిల్లా కార్యదర్శిగా వాడ గంగరాజు

14వ జిల్లా మహాసభల్లో రెండోసారి జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు జిల్లా కార్యదర్శిగా ఎన్నికైయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా సురేంద్రన్, ఓబుల్‌రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, షకీలను ఎన్నుకున్నారు.

జిల్లా మహాసభ తీర్మానాలు

- జిల్లా కేంద్రంలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలి.
- పాడి రైతుకు గిట్టుబాటుధర కల్పించాలి.
- స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలి, కనీస వేతనాలు అమలు చేయాలి.
- భూకబ్జాలు అరికట్టాలి.
- మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారలు, దాడులు అరికట్టాలి.
- దళితులపై దాడులు అరికట్టాలి.
- ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలి.
- హంద్రీ-నీవా కాలువ పెండింగ్ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలి.
- అడవిపల్లి రిజ్వరాయర్ పనులు పూర్తి చేసి చిత్తూరుకు తాగునీరు అందించాలి.
- జానపద కళాకారులకు కాణిపాకం దేవస్థానంలో కళాప్రదర్శనలకు అవకాశం కల్పించాలి.
- మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.
- పవర్‌లూమ్ కార్మికులకు తమిళనాడు తరహాలో 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి.

గంజాయి పంటపై నిఘా

- వ్యాపారుల అరెస్టు
- 20 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- శాంతిపురం: గంజాయి, ఎన్‌డిపిఎల్ అక్రమ వ్యాపారం, సరఫరా చేస్తున్న వ్యక్తులపై నిఘా వుంచామని కుప్పం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ యాదవ్‌కు అందిన సమాచారం మేరకు, రాళ్లబూదుగూరు పిఎస్ ఎస్ఐ నరేష్, గుడుపల్లి పిఎస్ ఎస్ఐ శ్రీనివాసులు, శాంతీపురం, రామకుప్పం రెవెన్యూ అధికారులు వారి సిబ్బందితో పాటుగా తెలిపిన ప్రాంతంలో గంజాయి వ్యాపారం, సరఫరా చేసే వ్యక్తులపై దాడులు నిర్వహించారు. ఆదివారం శాంతిపురం మండలం, అటకలదొడ్డి గ్రామానికి చెందిన ఎనుముల మునేప్ప కొడుకు చంద్రప్ప వ్యవసాయ పొలంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ చంద్రప్ప తనకు చెందిన వ్యవసాయ పొలంలో గంజాయి చెట్లను పెంచుకొని, అక్రమ వ్యాపారం చేస్తూ ఉండటంతో, అతన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో 0.5 కేజీల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఆదివారం మధ్యాహ్నం చిత్తూరు జిల్లా, రామకుప్పం మండలం, వీర్నమల పంచాయతి, గురుకులమడుగు గ్రామంలోని కృష్ణన్‌ను ఇంటి వద్ద అరెస్టు చేసి, అతని వద్ద సుమారు 15 కేజీల గంజాయి (పచ్చి ఆకులు), ఎండిన గంజాయి ఆకులు 400 గ్రాములను స్వాదీనం చేసుకొని అరెస్టు చేసి డిమాండుకుకు తరలించామన్నారు.

మాదక ద్రవ్యాల సాగు, విక్రయానికి పాల్పడితే కేసు



గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాల సాగు, నిల్వ, రవాణా , వినియోగం తీవ్రమైన శిక్షార్హ నేరమని తెలిపితే అలాంటి నేరానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్ (ప్రివెన్షన్ డిటెన్షన్ యాక్ట్) కింద కూడా చర్యలు తీసుకుంటామన్నారు. రామకుప్పం మండలంలో కొంతమంది తమ పొలాల్లో, ఇంటి అవరణ లో అక్రమంగా గంజాయి మొక్కలను పెంచుతున్నారని అందిన సమాచారం మేరకు త్వరలోనే ఆ ప్రదేశాల పై మరిన్ని దాడులు నిర్వహించి వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువతకు తెలియ జేయడం ఏమనగా గంజాయి వంటి మాదకద్రవ్యాలు సేవించి తమ జీవితాలను నాశనం చేసుకోద్దని సూచించారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించే వారికి కఠిన చర్యలు తప్పవు..

- జె మల్లేష్ యాదవ్, కుప్పం రూరల్ సిఐ.

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

సమావేశంలో యుటిఎఫ్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో విధ్వంసం జరుగుతున్న జీవో 117 రద్దు చేయడానికి చర్యలు తీసుకోవడం ఆనంద దాయకమని, 2023 జూలై నెల నుండి ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతన వేతన కమిటీని నియమించి, 33 శాతం మధ్యంతర భృతి(ఐఆర్)ని, దీపావళి పండుగ సందర్భంగా ప్రకటించాల్సిన కరువు భత్యంను (డీఏ) ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2024 నవంబర్ 3,4 తేదీలలో పూతలపట్టులో జరిగే జిల్లా స్వర్ణత్సవ మహాసభలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బి వరలక్ష్మి ని చిత్తూరు జిల్లా యుటిఎఫ్ శాఖ తరపున పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సోమశేఖర్ నాయుడు, ఎన్ మణి గండన్, నాయకులు పి సుధాకర్ రెడ్డి, పిఆర్ మునిరత్నం, ఎస్ రెహనా బేగం, ప్రసన్న కుమార్, టి రఘుపతి రెడ్డి, కె దీనావతీ, సిపి ప్రకాష్, ఎస్ పి బాషా, కృష్ణమూర్తి, రెడ్డప్ప నాయుడు, కె సరిత, డి ఏకాంబరం, బి ఈశ్వర్, మహేంద్ర, ఎం పార్థ సారథి, కె గణేష్ కుమార్, ఎం వి రమణ, జిసికే ప్రసాద్, సాధన కుమార్, రవీంద్ర బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

కల్వర్టు నిర్మాణంలో జాప్యం

- రాకపోకలకు అసౌకర్యం
- ఏడు గ్రామాల ప్రజలకు ఇక్కట్లు



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి సమీపంలోని బసవ పల్లెకు వెళ్లే మార్గంలో ఈ నెల 18వ తేదీ కురిసిన భారీ వర్షానికి గార్గేయ నది వంక ఉధృతంగా ప్రవహించి తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న జిల్లా స్థాయి పంచాయతీరాజ్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి వెంటనే తాత్కాలిక డైవర్షన్ మట్టి రోడ్డు నిర్మించేందుకు ప్రయత్నాలు ప్రారంభించి 22వ తేదీ లోపు పనులు పూర్తి చేశారు. అయితే 22వ తేదీ రాత్రి కురిసిన భారీ వర్షానికి డైవర్షన్ మట్టి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో ఈ ప్రాంతంలోని ఏడు గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కరంగా మారింది. అటు తర్వాత మళ్లీ అధికారులు కొట్టుకుపోయిన కల్వర్టు ప్రాంతానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి తిరిగి భారీ పైపులను ఏర్పాటు చేసి డైవర్షన్ రోడ్డు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని అయితే గార్గేయ నది నీటి ఉధృతి తగ్గగానే చర్యలు తీసుకుంటామని నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఇప్పటికీ ఐదు రోజులు అవుతున్నా ఇంతవరకు పైపులు మాత్రం ఏర్పాటు చేసి ఆ తర్వాత ఇసుక బస్తాలు పేర్చడం, మట్టి తోలి చదును చేయడం లాంటి పనులు చేయకపోవడంతో ఈ ప్రాంతం ఏడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అధికారి వివరణ

నీటి ప్రవాహం దాదాపు తగ్గిపోయినా నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై పిఐయుడి ఈ కరుణాకర్‌ను చరవాణి ద్వారా వివరణ కోరగా సోమవారం నుండి పనులు ప్రారంభిస్తామని నీటి ఉధృతి పూర్తిగా తగ్గిన తర్వాత పనులు చేపట్టి మరింత దృఢంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని అందువల్ల పనులు ఆలస్యం చేశామని, సోమవారం నుండి నిర్మాణ పనులు చేపట్టి నిరవధికంగా చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని రాకపోకలను పునరుద్ధరిస్తామని తెలిపారు.

మండుతున్న ధరలు

- అందని నిత్యావసర సరుకులు
- ఆందోళనలో నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు
- ధరల నియంత్రణ పట్టని కూటమి ప్రభుత్వం
- నాలుగు నెలల్లో ధరలు పైపైకి..

ప్రజాశక్తి -విజయపురం : ప్రస్తుతం వర్షాలు పడుతుంటే వాతావరణం చల్లగా వుందని వేడి వేడిగా ఏదైనా చేసుకొని తిందామంటే నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ ధరలు పెరిగిపోయాయి. పెరిగిపోతున్న నిత్యా వసరాల ధరలతో నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. సరుకుల ధరలతో పాటు కూరగాయల ధరలు సైతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఓ పక్కన కిరాణా షాపుకి వెళ్లి నిత్యావసర ధరలు చూస్తే భయం పుట్టుకొస్తున్నాయని, కూరగాయల మార్కెట్‌కు వెళ్లి చూసి కొనలేక...తినలేక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

రెండు నెలల్లోనే..

గత రెండు నెలల నుండి మార్కెట్లో సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు మార్కెట్‌కు వెళ్లి పెరిగిన ధరలు చూసి గుండెలు బాదుకుంటున్నారు. ఒకవైపు నిత్యావసర సరుకులు, మరోవైపు కూరగాయల ధరలు పెరిగి పోవడంతో ఏమి కొనలేని, తినలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. సన్‌ఫ్లవర్, పామాయిల్ నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కొబ్బరి, వెల్లుల్లి ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ 15 లీటర్ల డబ్బా రెండు నెలల క్రితం రూ.1,600 ఉండగా, ప్రస్తుతం రూ.2,050కి పైగానే పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజలు 'ఏమి కొనలేం.. ఏం తినలేం..' అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారం అంతంత మాత్రమే

ధరలు పెరిగిపోవడంతో ఆర్ధాకలితో ఉంటున్నామని ఓ పక్క ప్రజలు అంటుంటే, మరో పక్క ధరలు పెరుగుదలతో వ్యాపారం లేదని షాపు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర కొనుగోళ్లతో ప్రజలు సర్దుకుపోతుంటే వ్యాపారం లేక దుకాణ దారులు నష్టపోతున్నారు. ఒకప్పుడు కిటకిటలాడిన మార్కెట్లు, కిరాణా షాపులు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. ఒక వేళ ఎవరైనా వచ్చినా అరకొరగా సరుకులు తీసుకెళ్తున్నారని వ్యాపారస్థులు చెబుతున్నారు.

ధరల నియంత్రణ పట్టని కూటమి ప్రభుత్వం

ధరల నియంత్రణ పట్టని కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. గత వైసిపి ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు పంపిణీ చేసింది. నిత్యావసర సరుకులు ఇంటింటికీ సరఫరా అయ్యేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్డు దారులకు కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా బియ్యంతో సరిపెడుతోంది. కందిపప్పు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం మాటలకే పరిమితమైందంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా పేదల జీవితాలతో చెలగాటమాడు తోందని విమర్శిస్తున్నారు.



పెరిగిన నిత్యావసర ధరలు

సన్ ఫ్లవర్ ఆయిల్	రూ.- 140
పామాయిల్	రూ.- 120
కందిపప్పు	రూ.-190
ఉద్దిపప్పు	రూ.-160
చింతపండు	రూ.-140
తెల్లగడ్డ	రూ.-400
టమోట	రూ.-80
ఎర్రగడ్డ	రూ.- 60
బంగాళదుంప	రూ.-60
వంకాయ	రూ.- 60
అల్లం	రూ.-150
చిక్కుడు, క్యారెట్	రూ- 60

ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో ఘోరంగా విఫలమయ్యాయి. మార్కెట్లో నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఏమి కొనలేని, ఏమి తినలేని పరిస్థితి.. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి విపరీతంగా పెరిగిపోతున్న నిత్యావసర, కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

- నాగరాజు, మాధవరం, విజయపురం.



ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి

బి వరలక్ష్మి, చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారిణి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చిత్తూరు జిల్లా నూతన డిఈవో బి వరలక్ష్మి తెలిపారు. 'ప్రజాశక్తి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జిల్లాలో పని చేయడం ఎంతో సంతోషంగా వుందన్నారు. చిత్తూరు జిల్లాలో ఏడీ సూపరిండెంట్‌గా పని చేసిన అనుభవంతో జిల్లాలోని ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లోని విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల విద్యాబోధన తో విద్యార్థుల్లో క్రమ శిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు.

ప్రజాశక్తి : ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు..?

డిఈవో: ప్రధానంగా ఉపాధ్యాయుల వ్యవస్థ బాగుంటే విద్యావ్యవస్థ బాగుంటుంది. ఉపాధ్యాయులకు నేటి పరిస్థితికి అనుగుణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్షణ ఇచ్చి ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తున్నాం.

ప్రజాశక్తి : ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.. ఎలా పరిష్కరిస్తారు...?

డిఈవో: ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా విద్యాశాఖలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.. ప్రభుత్వ స్థాయిలో ఉన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతాం. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఐక్యంగా జిల్లాలో ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తాం..

ప్రజాశక్తి : మధ్యాహ్న భోజన కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.. ఎలా పరిష్కరిస్తారు?

డిఈవో: ప్రధానంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తప్పని సరి.. పెండింగ్ జీతాల విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా ఇచ్చేలా ప్రయత్నిస్తాం.. చిత్తూరు జిల్లాలో 2,475 ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 1,74,524 మంది విద్యార్థినివిద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. 4,603 స్వయం సహాయ సంఘాలు మధ్యహ్న భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నాయి.

ప్రజాశక్తి : మోడల్ స్కూల్ నిర్వహణ ఎలా ఉంది..?

డిఈవో: జిల్లాలో ఏడు ఆదర్శ పాఠశాలలో ఆరు నుండీ ఇంటర్ వరకు 4,736 మంది విద్యార్థినివిద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో ఐదు బాలికల వసతి గృహాల్లో ఐదువందల మంది బాలికలు వసతి పొందుతున్నారు. ఒక్కో బాలికల వసతి గృహంలో వంద మందికి ప్రవేశం కల్పించాం..

ప్రజాశక్తి : పదో తరగతి విద్యార్థులపై ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నారు?

డిఈవో: ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం..గత ఏడాది కంటే మంచి ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు గణితం తరగతులు విద్యార్థులు అర్థం చేసుకొనే రీతిలో రివిజన్ చేస్తాం.. దాదాపు అన్ని సబ్జెక్టులూ రివిజన్ చేస్తున్నాం.



సినీనటి ఐశ్వర్య రాజేష్ సందడి



జోస్ అలుక్కాస్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఐశ్వర్య రాజేష్

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలో పమనేరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జోస్ అలుక్కాస్ షోరూమ్ ప్రారంభంలో సినీనటి ఐశ్వర్య రాజేష్ ఆదివారం సందడి చేశారు. చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్, సినీనటి నూతన షోరూమ్‌ను ప్రారంభించారు. చిత్తూరు ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలకు చాలా సంతోషంగా వుందని ఈ సందర్భంగా సినీనటి ఐశ్వర్య రాజేష్ తెలిపారు. జోస్ అలుక్కాస్ దుకాణం ప్రారంభం అనంతరం ఆమె మాట్లాడుతూ చిత్తూరు ప్రజలు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలకు, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌కి కృజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, టిడిపి సీనియర్ నాయకులు చెరుకూరి వసంత్ కుమార్ పాల్గొన్నారు.

పీఈఎస్ విద్యార్థినుల ప్రతిభ



త్రోబాల్ టోర్నమెంటులో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వేలూరు ఫిట్జీ పాఠశాల వేదికగా ఈనెల 25, 26వ తేదీలలో నిర్వహించిన స్పోర్టానియా – 24 త్రో బాల్ టోర్నమెంట్‌లో దాదాపు పీఈఎస్ పబ్లిక్ పాఠశాల కు చెందిన ఎల్ భావ్యశ్రీ బృందం త్రో బాల్ రన్నర్ అప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ టోర్నమెంటులో 15 పాఠశాలల విద్యా విద్యార్థులు పాల్గొనగా అందులో వేలూరు ఫిట్జీ పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవిక్రష్ణ బాబు శిక్షణను అందించిన వ్యాయామ ఉపాధ్యాయుడు అరవిందన్‌ని, విద్యార్థులను అభినందించారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించండి

సిఎంకు చిన్నస్వామి వినతి


ముఖ్యమంత్రిని కలిసిన రిటైర్డు ఎస్‌పి, టిడిపి నేత చిన్నస్వామి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: నామినేటెడ్ పదవుల కేటాయింపులో తనకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు రిటైర్డ్ ఎస్‌పి, టిడిపి నేత పి చిన్నస్వామి విజ్ఞప్తి చేశారు. గంగాధర నెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డి పల్లి ఆది ఆంధ్రవాడకు చెందిన రిటైర్డ్ ఎస్‌పి చిన్నస్వామి అమరావతిలోని సచి వాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి బయోడేటా ను అందించి నామినేటెడ్ పదవుల్లో తనకు అవకాశం కల్పించాలని కోరారు.

బాస్ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మంద సీతాపతి



ప్రజాశక్తి - సదుం : భారతీయ అంబేద్కర్ సేన(బాస్) పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మంద సీతాపతిని నియమిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా బాధ్యులు పాలకుంట శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాస్‌కు ఎన్నికైన మంద సీతాపతి మాట్లాడుతూ బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్‌కు, రాష్ట్ర కన్వీనర్ ఎం గణపతికి, పాలకుంట శ్రీనివాసులుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టైమింగ్స్ మార్చిన రైల్వే

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడుస్తున్న కొన్ని ప్రధానమైన రైళ్ల సమయాలను మారుస్తూ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇలా మార్చిన సమయాల ప్రకారమే ఈ రైళ్లు ప్రస్తుతం నడుస్తున్నాయి. టైమింగ్స్ మార్చిన వాటిల్లో నారాయణాద్రి, పద్మావతి, నాగర్‌సోల్ రైళ్లు ఉన్నాయి. ఏయే టైమింగ్స్ ప్రకారం నడుస్తున్నాయో వాటి వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపల్లి నుంచి తిరుపతి మధ్య నడుస్తున్న నారాయణాద్రి 12734 ప్రతిరోజు సాయంత్రం 5.30 గంటలకు లింగంపల్లిలో బయలుదేరి 6.05 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి తెల్లవారుజామున 5.55 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. గుంటూరుకు రాత్రి 10.55 గంటలకు చేరుకుంటుంది. మార్గమధ్యంలో బేగంపేట, సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గుడూరు, వెంకటగిరి, శ్రీకళాహస్తి, రేణిగుంట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. హైదరాబాద్ నుంచి తిరుపతి మధ్య నడుస్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ 12764 టైమింగ్స్‌లో కూడా స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. గూడూరు వరకు ఎటువంటి సమయం మార్చలేదు. గూడూరుకు ఉదయం 4.19 గంటలకు, రేణిగుంటకు 5.58 గంటలకు, తిరుపతికి 6.55 గంటలకు చేరుకుంటుంది. హైదరాబాద్‌లో సాయంత్రం 6.30 గంటలకు పద్మావతి బయలుదేరుతుంది.

31న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

ప్రజాశక్తి- తిరుమల: ఈనెల 31వ తేదీన తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం సందర్భంగా స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను టిటిడీ రద్దు చేసింది. ఇందుకు సంబంధించి 30వ తేదీ బుధవారం తిరుమలలో సిఫార్సు లేఖలు స్వీకరించబడవని టిటిడీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని భక్తులకు టిటిడీ విజ్ఞప్తి చేస్తోంది.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కోట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతి ఎస్వీ అరవింద నేత్రాలయం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 180మందికి డాక్టర్లు కంటి పరీక్షలు చేశారు. 60మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ, 20మందికి ఆపరేషన్‌లు చేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు గౌరిశంకర్, సీతారామ్ నాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణ, నేత్రాలయ సిబ్బంది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఓం శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ అండ్ సొసైటి వారి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీ సత్యసాయి సేవా సమితి, కుమ్మరి వీధిలోని ప్రేమ సుధ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సొసైటి సభ్యులు వెంకటసుబ్బయ్య, తిరుపాలయ్య, సురేష్ బాబు, ఆనంద్ బాబు, మల్లికార్జున, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గంధ మహోత్సవానికి విచ్చేయండి'

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అజ్మతే ఇలాహి పంచతన్ మౌలాక పహడ్ పుత్తూరు ఎన్టీఆర్ కాలనీ గుట్టలో ఉన్న దర్గాలో గంధం మహోత్సవానికి విచ్చేయాలని ముస్లిం మైనారిటీ నాయకులు పలువురికి ఆహ్వానం పలికారు. టీడీపీ నాయకులు జీవరత్నం నాయుడు, గణేష్, షణ్ముఖ రెడ్డి, బాబు నాయుడు, మహమ్మద్ నబికి ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు హెస్సేన్, రఫీ అహమ్మద్, మత పెద్దలు మహమ్మద్, గౌస్, శబ్బర్, చాను, హమీద్ బాషాలు ఉన్నారు.

నేడు పుత్తూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సీడప్, డిఆర్‌డిఏ సంయుక్తంగా స్థానిక హిమజ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహిం చనున్నట్లు కళాశాల చైర్మన్ సురేంద్ర రాజు, ప్రిన్సిపాల్ లోకనాధంలు ఆదివారం ఒక ప్రక టనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐదు బహుళ జాతీయ సంస్థల వారు పాల్గొని అభ్య ర్థులు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో పది, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్, ఐటిఐ చదివిన 18 నుంచి 32ఏళ్ల వయస్సు గల స్త్రీ, పురుషులు అర్హులు అన్నారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 6300954441, 9963561755 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబు కుట్రలో పావుగా మారిన షర్మిల : భూమన


ప్రజాశక్తి-తిరుపతి సిటీ: చంద్రబాబు చేసిన కుట్రలో పిసిసి అధ్యక్షులు షర్మిల పావుగా మా రారని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణా కర్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడు తూ జగన్ లాంటి నాయకుడు రాజకీయాల్లో చాలా అరుదు, ఇచ్చిన మాటకు వెనుకంజ వేయకుండా సర్వం త్యాగం చేయడానికి సిద్ధ పడ్డ వ్యక్తి జగన్, 2009లో సోనియాకు లొంగి వుంటే ఇప్పుడు పరిస్థుతులు మరోలా ఉండే దని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఎటువంటి చిన్న తప్పు చేయలేదన్నారు. షర్మిల తప్పు చేసి జగన్ సరస్వతి షేర్స్‌ని అమ్మపేరు మీద గిఫ్ట్‌గా రాస్తే తల్లి అమాయకత్వాన్ని వాడుకొని జగన్ బెయిల్‌ను రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు కుట్రలో షర్మిల భాగస్వాములయ్యారన్నారు.

దీపావళి వెలుగులు నింపండి: సిఐటియు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి 104 సిబ్బంది జీవితాల్లో దీపావళి నింపాలని సీఐటీయూ అనుబంధ 104 యూని యన్ జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్, ప్రధాన కార్యదర్శి బత్తిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. దీపావళి అంటే అందరి జీవితాల్లో వెలుగులు వస్తాయనీ, మా జీవితాల్లో అంధకారం నెలకొనే పరిస్థితి ఉందని వాపోయారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం 104 తిరుపతి జిల్లా యూనియన్ సమా వేశం జరిగింది. గత మూడు నెలలుగా పెండింగ్లో ఉన్న జీతాలు అందక అప్పులు చేసి కుటుంబాలు పోషించు కుంటున్నామని అన్నారు. 2005 నుంచి పనిచేస్తున్న ఉద్యోగస్తులను రెగ్యులర్ చేయాలనీ, 2020 నుంచి పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశా రు. కనీస వేతన చట్టం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి భువనేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీమోహన్, సిఐటియు నాయకులు పుల్లయ్య, గురవయ్య, వెంకటేష్, గంధం మణి పాల్గొన్నారు.

కుక్కల బెడద

భయాందోళనలో చిన్నారులు, వృద్ధులు


బస్టాండు కూడలిలో సంచరిస్తున్న శునకాలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలోని బస్టాండ్ కూడలి బజారు వీధి ప్రాంతాలలో వీధి కుక్కలు అధికమై స్వైర విహారం చేస్తున్నాయని చిన్నారులు, వృద్ధులు రోడ్డుపైకి రావాలన్నా ద్విచక్రవాహన దారులు వాహనం నడపాలన్నా ఇబ్బంది కరంగా మారుతోంది. బస్టాండ్ కూడలి బజారు వీధిలో అధికంగా చికెన్, మటన్ విక్రయ దుకాణాలు ఉన్న కారణంగా వీధి కుక్కలు దుకాణాదారులు వేసే మాంసం ముక్కల కోసం నిత్యం రోడ్డుపైనే తిరుగుతూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. కుక్కలను అరిచినా, తరిమినా మనుషులపైనే ఎదురు తిరుగుతూ ఒక్కోసారి కరుస్తున్నాయి. పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా సమస్యను పరిష్కరిం చడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చికెన్, మటన్ విక్రయ దుకాణాలు గ్రామానికి దూరంగా నిర్వహించే విధంగా పంచాయతీ వారు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇకనైనా వీధి కుక్కలను నియంత్రించి చిన్నారు లు, వృద్ధులు, వాహన చోదకులు సజావుగా రోడ్లపై తిరిగే విధంగా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెలుగు భాషా సంస్కృతి వికాసానికి కృషి చేద్దాం..


బహుమతులతో విద్యార్థులు, తులసీనాథంనాయుడు దంపతులు పుష్ప

ప్రజాశక్తి -గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితిని స్ఫూర్తిగా తీసుకొని తెలుగు భాషా సంస్థల వికాసానికి కృషి చేద్దామని ఆచార్య కిరణ్ క్రాంతి చౌదరి పిలుపు నిచ్చారు. కళామందిరంలో ఆదివారం నిర్వహించిన పుష్కరోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో విలువలను పెంపొందించడానికి, సాహిత్యాన్ని చదివించడమే మార్గమని పిల్లలకు సంపద అందించడం కంటే సంస్కారాన్ని అందించడానికి కృషి చేయాలని, పద్యాలు, కథలు సాహిత్యాన్ని నేర్పాలన్నారు. తెలుగు సాహిత్య సేవా సమితి అధ్యక్షులు తులసీనాథంనాయుడు తెలుగు భాషా పరిరక్షణ కోసం 12 సంవత్సరాలుగా ఎనలేని సేవలందించారని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పిల్లల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి లక్షన్నర పుస్తకాలు పైగా పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. తన జీవితా న్ని తెలుగు భాషకు అంకితం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి గెలుపొందిన 62 మంది విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ రెడ్డి , పలమనేరు బాలాజీ మాధవ్, వేణుగోపాల్ రెడ్డి, పలువురు కవులు, విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

రేపు ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో ఈ నెల 29వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు తహశీల్దారు అధ్యక్షతన ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు బెన్ను రాజ్ తెలిపారు. ఈ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మండలంలోని ఎస్‌సి, ఎస్‌టి గ్రామాలలో మౌలిక వసతులపై సమస్యలు ఉంటే తెలుపవచ్చని అంతే కాకుండా మండలంలో ఇతర గ్రామాలలో వున్న సమస్యలను తెలిపితే చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి: ఎంఆర్‌పిఎస్

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మండల నాయకుల డిమాండ్ చేశారు. ఈనెల 29వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొని అధికారులు ఎస్‌సి, ఎస్‌టి గ్రామాలలో రాజ్యాంగ బద్ధంగా కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు పూర్తి స్థాయిలో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఎన్నో మానిటరింగ్ కమిటీ సమావేశాలు జరిగాయని అయితే సమావేశం నిర్వహించడం ఆపై సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. అలాకాకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, దళితుల అభివృద్ధికి దళిత గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి నాయకులు మొగిలీశ్వరయ్య, మురళి, రామనాథం, ప్రకాష్, వెంకటరామయ్య, శుభకర్, శివమణి పాల్గొన్నారు.

కరుణిగర్ సంఘం అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: కరుణిగర్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ పరిధిలోని బోడిరెడ్డిపల్లి కాలనీలో పలమనేరు కరుణిగర్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ జ్యోతి రామలింగ స్వామి ధ్యాన మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధ్యాన మందిర ప్రారంభోత్సవ అనంతరం ఆయన మాట్లాడుతూ కరుణిగర్ సామాజిక వర్గాన్ని బీసీలలో చేర్చాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డిమాండు నెరవేరేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కరుణిగర్ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పలమనేరులో ధ్యాన మందిరాన్ని ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరుణిగర్ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం పిళ్లే, సివి కుమార్, సుధాకర్ పిళ్లే ,జయశంకర్, మురళీధర్, కిషోర్ కుమార్, జ్యోతిశ్వర్ పాల్గొన్నారు.

గణనాథుని సేవలో ఎంపీ


ఎంపీకి చిత్రపటాన్ని అందిస్తున్న ఏఈఓ రవిబాబు నాయుడు

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం వరసిద్ధి వినాయకుని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంటు ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కాణిపాకం ఆలయం వద్దకు చేరుకున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సిఆర్ రాజన్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, చిత్తూరు పార్లమెంటు జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు సునీల్ చౌదరి, మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు, టిడిపి నాయకులు రాజశేఖర్ నాయుడు, శ్రీధర్ యాదవ్, జీవన్ రెడ్డి అఖిల్, సౌందర్య రాజు, వరసిద్ధి వినాయక ఆలయ మాజీ పాలక మండలి అధ్యక్షుడు మణి నాయుడు, ఆలయ ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్ వాసు ఆలయ ప్రాంగణంలో ఘన స్వాగతం పలికారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఆలయంలో దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆలయ అధికారు లు గణనాథుని చిత్ర పటాన్ని అందించి తీర్థ ప్రసాదాలు అందిం చారు. అనంతరం వేదపండి తులు వేద ఆశీర్వాదం అందిం చారు. ఆలయం వెలుపల ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లా డుతూ చిత్తూరు పార్లమెంటు అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గాన్ని పేదలు లేని నియోజక వర్గంగా తీర్చిదిద్దాలన్నదే తన సంకల్పమన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతో సంస్కరణలను తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తన కష్టానికి ఫలితం త్వరలో సాకారం కాబోతుందని ఆయన తెలిపారు. చిత్తూరు పార్లమెంటులో టిడిపి సభ్యత్వ నమోదు శరవేగంగా సాగుతోందని తెలిపారు. టిడిపి అధిష్టానం ఆదేశా లకు అనుగుణంగా తాను ఎమ్మెల్యేల సమన్వయంతో లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తు న్నామని ఎంపి తెలిపారు.

క్రీడా రంగానికి తోడ్పాటు: ఎమ్మెల్యే



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి- ఐరాల: ఆంధ్రప్రదేశ్ ను అన్ని విధాలుగా అభివృద్ధితో పాటుగా క్రీడా రంగాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ స్పష్టం చేశారు. ఆదివారం కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన 43వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీలు అట్టహాసంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, శాప్ ఛైర్మన్ రవి నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖోఖో పోటీల్లో ప్రకాశం జిల్లాకు చెందిన బాలురు ప్రథమ స్థానం సాధించగా, ద్వితీయ స్థానం కృష్ణా జిల్లాకు చెందిన బాలురు సాధించారు. బాలికల్లో ప్రథమ స్థానం ఈస్ట్ గోదావరి జిల్లా బాలికలు సాధించగా, శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాలికలు ద్వితీయ స్థానం సాధించారు. వీరికి ఎమ్మెల్యే మురళీమోహన్ , చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, శాప్ ఛైర్మన్ రవినాయుడు చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సి.ఆర్.రాజన్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోందన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని, ఖోఖో క్రీడ జాతీయ స్థాయి క్రీడగా కావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఖోఖో పోటీలు ఎంతో మందికి భవిష్యత్తును అందించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందడంతో పాటు క్రీడాపరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి అన్ని విధాలుగా ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల పార్టీ అధ్యక్షులు గిరిధర్ బాబు, ఐరాల జెడ్పిటీసి సుచిత్ర కన్నయ్య నాయుడు, మాజీ కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, చిత్తూరు జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు హరిబాబు నాయుడు, మాజీ జెడ్పిటీసి లతాబాబు నాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు , మండల నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మృతి చెందిన లోకేష్‌రావు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో శనివారం గాయ పడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి వికటించి ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ రాజ్‌కుమార్ కథనం మేరకు.. పుత్తూరు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గంజి లోకేష్‌రావు తన సొంత పనుల నిమిత్తం స్నేహితునితో కలసి ద్విచక్రవాహనంలో కార్వేటినగరానికి వస్తున్న సమయంలో రోడ్డుపై వాహనానికి కుక్క అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించే ప్రయత్నంలో హఠాత్తుగా బ్రేకు వేయడంతో వాహనంలో వెనుక కూర్చున గంజి లోకేష్‌రావు అదుపుతప్పి రోడ్డుపై పడటంతో అతని తలపై తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం అమరా ఆస్పత్రికి తరలించారు. శనివారం రాత్రి మెరుగైన వైద్యం కోసం చెన్నై జీహెచ్‌ఎస్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ఐరాల జెడ్పిటిసి టిడిపిలో చేరిక


టిడిపిలో చేరిన ఐరాల జెడ్‌పిటిసి సుచిత్ర కన్నయ్యనాయుడు

ప్రజాశక్తి-ఐరాల: పూతలపట్టు నియోజకవర్గం, ఐరాల మండల జెడ్పిటీసి సుచిత్ర కన్నయ్య నాయుడు టిడిపి తీర్థం పుచ్చు కున్నారు.ఆదివారం మధ్యాహ్నం ఐరాల మండలం, కలికిరిపల్లెలో పూతల పట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ అధ్యక్ష తన నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఐరాల మండల జెడ్పిటీసి సుచిత్ర కన్నయ్య నాయుడు ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి ఆ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మురళీమోహన్ సమక్షంలో లక్ష రూపాయలు కట్టి టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరామని సుచిత్ర కన్నయ్య నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల టిడిపి అధ్యక్షులు గిరిధర్‌బాబు, జిల్లా టిడిపి రైతు సంఘం ఉపాధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, మాజీ జెడ్పిటీసి లతాబాబు నాయుడు, మండల నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర యోగా పోటీలకు సదుం విద్యార్థి

ప్రజాశక్తి - సదుం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి జి నరేందర్ రెడ్డి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై జయకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ తిరుపతిలోని శ్రీ విఘ్నేశ్వర యోగ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన అండర్ 19 బాల బాలికలకు యోగా పరీక్షలు నిర్వహించగా జి నరేందర్ రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర యోగ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీ రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న యోగా పోటీలలో జి నరేందర్ రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వై జయకుమార్ రెడ్డి, జి నరేందర్ రెడ్డికి యోగా శిక్షణ ఇచ్చిన సదుం ఉన్నత పాఠశాల పీడీలు కిషోర్, రెడ్డి ప్రవీణ్‌లను ఆయన అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థి జి నరేందర్ రెడ్డి రాష్ట్ర యోగా పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి, సదుం ఉన్నత పాఠశాలకు కీర్తి, ప్రతిష్టలు తెస్తారని ఆయన ఆకాంక్షించారు.

బోరు ఏర్పాటుకు భూమి పూజ


తాగునీటి బోరు ఏర్పాటుకు భూమి పూజ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-గుడిపల్లి: తాగునీటి ఎద్దడి నివారణకు ప్రజాప్రతి నిధులు ఆదివారం బోరు ఏర్పా టుకు భూమి పూజ నిర్వహిం చారు. మండలంలోని చిన్న గొల్లపల్లి గ్రామ పంచాయతీ, చిన్న గొల్లపల్లిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్ అధికారులకు తెలిపారు. వెంటనే కొత్త తాగునీరు బోరు తవ్వించడానికి ఏర్పాటు చేసి ఆదివారం భూమి పూజ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోడెప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండ: ఎమ్మెల్యే నాని


కార్యకర్తలను కలిసిన ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని అన్నారు. ఆదివారం మండలంలోని గుంతూరు గ్రామంలో సర్పంచ్ ద్రాక్షాయిని గృహం లో జరిగిన ప్రైవేట్ కార్యక్ర మానికి ఆయన హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో తరచూ కలవాలనే ఉద్దేశంతో జిల్లా పర్యటన చేస్తున్నానని, పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వాణిజ్య విభాగ అధ్యక్షులు వంశీ చౌదరి, గ్రామస్తులు, రవీంద్ర నాయుడు , సుదర్శన నాయుడు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ

ప్రజాశక్తి-రామచంద్రాపురం: ఉచిత ఇసుకను అక్రమంగా వాహనాలలో తరలిస్తే కఠిన చర్యలు తప్పవని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం ఇసుక అక్రమ రవాణాలను అరికట్టేందుకు రాయలచెరువు కట్టపై చెక్ పోస్ట్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. స్వర్ణముఖి నది నుంచి ఇసుకను ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా టిప్పర్లు లారీలతో ఇతర రాష్ట్రాలకు జిల్లాలకు తరలించరాదన్నారు. అనంతరం ఆర్‌సి పురం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్లో సిబ్బంది కొరతపై విలేకరులు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ రామాంజనేయులు, ఏఎస్ఐ శేఖర్, హెడ్ కానిస్టేబుల్ యోబు, సురేష్, సుధాకర్ రెడ్డి, రమేష్, త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌తో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి కపిలతీర్థం, అలిపిరి రోడ్డులోని దివ్యారామంలో ఆదివారం వాకర్స్‌తో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మమేకమై స్థానికంగా ఉన్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. తిరుపతిలోని 15 వాకర్స్ పార్కులలో ఒక్కొక్కరోజు ఒక పార్క్ చొప్పున వాకర్సతో మమేకమై నియోజకవర్గ సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, గురునాథం, కృష్ణకాంత్, వాసు పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తారకరామ స్టేడియంలో నిర్వహించిన కార్తీక్ మ్యూజిక్ కాన్సర్టుకి వెళ్లిన యూనివర్సిటీ విద్యార్థులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఈస్ట్ పోలీస్ స్టేషన్ డిఎస్పి వెంకట నారాయణకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవిలు మాట్లాడుతూ శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో యూనివర్సిటీ విద్యార్థులైన నరేంద్ర, వీరేష్‌లు గ్రౌండులో ఉండగా అక్కడ వున్న నలుగురు స్పెషల్ పార్టీ పోలీసులు వచ్చి ఇక్కడ కూర్చోకూడదని చెప్పడంతో అక్కడ నుంచి వెళ్ళిపోతుండగా వెనక నుంచి వచ్చి మెడపట్టుకొని తోసారని, అప్పుడు వీళ్లిద్దరు ఎందుకు సార్ కొడుతున్నారు, మేము వర్సిటీ విద్యార్థులమేగా అని చెప్పడంతో రవిబాబు నాయక్ అనే కానిస్టేబుల్ దుర్భాషలు ఆడుతూ యూనివర్సిటీ విద్యార్థులు అయితే ఏమైనా పీకుతారా, అక్కడ ఉన్న యూనియన్ నాయకులు అంతా నాకు తెలుసు, ఎస్పీ కూడా నన్ను ఏమి చెయ్యలేడంటూ క్యాంపస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని, మళ్ళీ అక్కడ ఆరు మంది పోలీసులు కలిసి వారిని చితకబాది మొబైల్స్ లాక్కుని స్టేషన్ బయటకు తరిమివేశారని తెలిపారు. అక్కడ వున్న మిగతా విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన నాయకులు అక్కడకి చేరుకొని సీఐ రామయ్యతో మాట్లాడి మొబైల్స్ ఇప్పించారని, ఆ రాత్రి ముప్పైమంది విద్యార్థులతో క్యాంపస్ స్టేషనుకి వెళ్లి కానిస్టేబుల్స్ పైన చర్యలు తీసుకోవాలని కోరగా సీఐ రామయ్య స్పందిస్తూ విద్యార్థులను నేరుగా డీఎస్పీ దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడినట్లు తెలిపారు. డీఎస్పీ వెంకట నారాయణ మాట్లాడుతూ ఈ విషయం ఎస్పీతో మాట్లాడి వాళ్ళమీద కఠిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులపై అకారణంగా దాడి చేసిన వారిని సస్పెండ్ చెయ్యకపోతే యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. సోమవారం ఈ విషయాన్నీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జిల్లా నాయకులు అశోక్, తేజ, శ్రీనివాస్, వినోద్, కిరణ్, విద్యార్థు లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం : సిపిఎం

తిరుపతి టౌన్: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తారకరామా స్టేడియంలో కార్తీక్ లైవ్ మ్యూజిక్ కాన్సెట్‌కు హాజరైన ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులపై అకారణంగా దాడి చేసిన కానిస్టేబుల్ రవినాయక్ ఇతర ముగ్గురు కానిస్టేబుల్స్‌ను సస్పెం డ్ చేయాలని సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది.